క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


సమస్యలు తెలుసుకుంటున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక: బీఆర్‌ఎస్ పాలనలో దుబ్బాక నియోజక వర్గ సమస్యలను పరిష్కరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో, డబుల్ బెడ్రూం కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 17వ వార్డులో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం విచారకరమన్నారు. డబుల్ బెడ్రూం కాలనీలలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేదని ఆరోపించారు. కేజీబీవీలో మరుగుదొడ్లు, నీటి వసతి సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులపడుతున్నారని, సమస్యను ఉన్నత అధికారులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు అండతో ఇసుక అక్రమ రవాణా

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి మద్దూరు మండలంలో అధికారుల అండతో అక్రమార్కులు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం లద్నూరు గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయనికి గండి కొడుతున్నారన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డాక్టర్ తూమోజుకు ప్రతిష్టాత్మక అవార్డు

కోహెడరూరల్(హుస్నాబాద్): ఏటా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అవార్డుల ప్రదానం చేస్తుంది. 2024కు మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ తూమోజు జగదీశ్వరాచారి ఎంపికైనట్లు జూనియర్ ఇంటర్నేషనల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాజు అరుముల తెలిపారు. అవుట్ స్టాండింగ్ ఎక్సెలెన్స్ ఇన్ రీసెర్చ్ కమల్ పాత్రా 2024కు అవార్డుకు ఈయన ఎంపికై నట్లు పేర్కొన్నారు. కాగా, జగదీశ్వరాచారి ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈయన ఇప్పటికే 20 అంతర్జాతీయ స్థాయిలో తమ పరిశోధనా పత్రాలను వెలువరించారు. ఈనెల 4వ తేదీన మంచిర్యాల జరిగే సభలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

లయన్స్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి

హుస్నాబాద్: విద్యార్థి దశలో ఇష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం సాధ్యపడుతుందని లయన్స్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సీవీ రామన్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హుస్నాబాద్ రేణుక నిర్వహించిన కార్యక్రమంలో 9, 10వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాల్లో పట్టు సాధిస్తూనే మంచి అలవాట్లతో కూడిన వ్యక్తిత్వ వికాసం, ప్రయోగశాల నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నిత్యం దినపత్రికలు, ప్రముఖుల ఆత్మకథలు, నిపుణుల రచనలు చదవడం అలవాటుగా మారాలన్నారు. కార్యక్రమంలో లయన్ తక్కలపల్లి రాజగోపాల్ రావు, మహేందర్, చిట్టి గోపాల్ రెడ్డి, కాయిత నారాయణ రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ సీటుకు దరఖాస్తు

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ తరపున వరంగల్ లోకసభకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేసినట్లు శుక్రవారం పట్టణానికి చెందిన మాజీ ఎంపీపీ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ తెలిపాడు. గతంలో రెండుసార్లు వరంగల్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడి పోయినట్లు చెప్పాడు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశానన్నారు.

ఏబీవీపీ ఆందోళన

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో వసతులులేవని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. దీంతో శుక్రవారం కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వివేక్‌వర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ అటానమస్ కళాశాలలో మౌలిక వసతులు లేకపోవడం విచారకరమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం ఇచ్చారు.

అధ్వాన రోడ్డుతో తిప్పలు

- రాకపోకలకు అనువుగాలేని దారి
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- బీటీ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు
- ఏడాది గడుస్తున్నా ప్రారంభం కాని పనులు


గుంతలమయమైన గజ్వేల్-బయ్యారం రహదారి

గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు దెబ్బతింది. కొన్నేళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దుస్థితి మండల పరిధిలోని గజ్వేల్ నుంచి బయ్యారం గ్రామాల మధ్య నెలకొంది. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.

గజ్వేల్‌రూరల్ : గజ్వేల్ పట్టణ శివారు నుంచి బయ్యారం గ్రామం వరకు 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును గతంలో వేశారు. ఈ దారిగుండా బయ్యారంతో పాటు చిన్న ఆరెపల్లి(ఎస్‌బీ), బెజుగామ గ్రామాల నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు పనుల కోసం మండల కేంద్రమైన గజ్వేల్‌కు రాకపోకలు సాగించేవారు. అయితే ఈ మార్గంలో రింగురోడ్డు పనులు జరుగుతున్నాయి. భారీ వాహనాలు రాకపోకలతో క్రమంగా రోడ్డంతా గుంతలమయమైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రారంభం కాని పనులు

గజ్వేల్ నుంచి బయ్యారం రోడ్డు గుంతలమయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రాత్రి వేళల్లో కొందరు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఈ మార్గంలో రింగురోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో పైనుంచి ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు బ్రిడ్జి కింద నీళ్లు ఉన్న విషయం తెలియక అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు మినహాయిస్తే ఆటోలతో పాటు ఇతర వాహనాల్లో వెళ్లేవారు మరో మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు మరమ్మతులకు ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద రూ.80 లక్షలు మంజూరై ఏడాది గడుస్తున్నా ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడంతో ప్రభుత్వం, అధికారుల తీరుపై మండిపడుతున్నారు. నిత్యం ఈ మార్గం గుండా వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


గజ్వేల్-బయ్యారం మధ్య రింగురోడ్డు బ్రిడ్జి కింద నిలిచిన నీరు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

మా ఊరి నుంచి నిత్యం విద్యార్థులు చదువు కోసం, ప్రజలు ఇతర పనులపై గజ్వేల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గుంతలమయమైన రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలమయమైన రోడ్డు కారణంగా మరో మార్గంలో వెళ్తున్నాం. వాహనదారులు, ఆటోలలో ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.


– కుమార్, బయ్యారం

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈఓ శ్రీనివాస్ రెడ్డి


మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

హుస్నాబాద్: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతీ పాఠశాలలో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్, వీక్లీ టెస్ట్ నిర్వహించాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో పదో తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ప్రగతిలో వెనుకబడిన విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, మండల విద్యాధికారి దేశిరెడ్డి, నోడల్ ఆఫీసర్లు, స్కూల్ కాంప్లెక్స్ నోడల్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అమర్చండి


నోటీసులు అందజేస్తున్న ఎస్‌ఐ మహేష్

హుస్నాబాద్: ప్రజల భద్రత కోసం దుకాణాల ఎదుట సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఎస్‌ఐ తోట మహేష్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాలను సందర్శించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని దుకాణ యాజమానులకు నోటీసులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రాతినిధ్య చట్టం 2019 ప్రకారం వర్తక, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమన్నారు. ఇంటి యజమానులు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హుస్నాబాద్: హుస్నాబాద్ మెకానిక్స్, ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా జక్కుల రమేష్, గౌరవ అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్, గౌరవ సలహాదారులు బండారి బాలకిషన్, అడపల పుల్లారావు, ఉపాధ్యక్షుడు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి బైకిని వెంకటేశ్, కోశాధికారి గోనెల చిరంజీవి, కార్యదర్శులు దామెర రమేష్, గాదర్ల గణేష్, ప్రచార కార్యదర్శి రాజిరెడ్డి, సభ్యులను ఎన్నికయ్యారు.

చదువుతోనే మంచి భవిష్యత్

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే మంచి భవిష్యత్ లభిస్తుందని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోనెపల్లి, మేడిపల్లి ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే హరీష్‌రావు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలేషంగౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం పాలన బాధ్యతలు అప్పగించినందున, గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను చిత్త శుద్ధితో పరిష్కరించాలని ఎంపీపీ బాలేషంగౌడ్ సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో గ్రామ పంచాయతీలో బాధ్యతలు స్వీకరించిన అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాస్ (చంద్లాపూర్, మాచాపూర్, చౌడారం), తహసీల్దార్ జయలక్ష్మి (విఠలాపూర్, రామంచ), ఎంపీఓ సోమిరెడ్డి (ఇబ్రహీంనగర్, రాముని పట్ల, మల్లారం), పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మం (పెద్దకోడూరు, సికింద్లాపూర్), ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికిరణ్ (అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి), ఏఓ జయంత్ (గోనెపల్లి, ఒబులాపూర్), ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి (కిష్టాపూర్, ఎల్లాయపల్లి), ఇరిగేషన్ ఏఈ రంగాయపల్లి, మెట్‌పల్లి, గంగాపూర్) విధుల్లో చేరారు.

ములుగు(గజ్వేల్): పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ములుగు మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలకుగాను వివిధ శాఖలకు చెందిన అధికారులను సర్పంచ్‌ల స్థానాల్లో ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల్లో వారు బాధ్యతలు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాతో పాటు పలు చోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. 19 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన జడ్జి శ్రావణి రూ.30,500 జరిమానా విధించారు.

జాతర ఏర్పాట్లకు వేలం

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర ఏర్పాట్లకు శుక్రవారం వేలం పాట నిర్వహించినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు. లడ్డూ, పులిహోర, ప్రసాదం విక్రయించే హక్కును పాగుల అనిత రూ.16,01,000 దక్కించుకున్నారు. జాతరకు వైట్ పెండల్స్ వేయడానికి రూ.2.33 లక్షలు, పూల అలంకరణకు రూ.35 వేలు, డెకరేషన్‌కు రూ, 1.30 లక్షలు, టెంట్ సామగ్రి రూ.49 వేలకు, గుడికి రంగులు వేసేందుకు రూ.1.59 లక్షలకు ఇతరులు పొందినట్లు చెప్పారు. మిగితా వేలం పాటలను 6న నిర్వహిస్తామన్నారు.

శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే చర్యలు

మిరుదొడ్డి(దుబ్బాక): శాంతి భద్రతల ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం దుబ్బాక సీఐగా బాధ్యతలను స్వీకరించిన శ్రీనివాస్‌ను ఎంపీపీ గజ్జెల సాయిలు, తాజా మాజీ సర్పంచ్‌లు తుమ్మల బాల్‌రాజు, పన్యాల వెంకట్‌రెడ్డి, పిట్ల సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సూకూరి లింగం, గొట్టం రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీలు ధార స్వామి, గొట్టం భైరయ్య తదితరులు సన్మానించారు.

చట్టప్రకారం చర్యలు తీసుకోండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో అభివృద్ధి పేరిట ఉపసర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా డబ్బులు డ్రా చేసిన సర్పంచ్‌పై, కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్‌కు ఉప సర్పంచ్ బింగి మల్లేశం వినతిపత్రం అందజేశారు. తమకు సమాచారం లేకుండా ఐదు నెలలుగా పంచాయతీ సిబ్బంది, సర్పంచ్ కలిసి పనులు చేశామని సుమారు రూ.30 లక్షలు డబ్బులను డ్రా చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, కోఆప్షన్ సభ్యుడు ఇక్బాల్ పాల్గొన్నారు.

వైన్స్‌లు తొలగించాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రధాన రహదారులకు సమీపంలో నిర్వహిస్తున్న వైన్స్‌లను తొలగించేందుకు ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ కోరారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ నిబంధనలు పాటించకుండా వైన్స్‌లను నిర్వహించే వెసులుబాటు కల్పించారన్నారు. దీంతో రాజీవ్ రహదారి పొన్నాల సమీపంలో ఓ వైన్స్ వద్ద నిత్యం మందుబాబులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం రహదారికి దూరంగా ఏర్పాటు చేసే విధంగా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

ఘర్షణపై విచారణ

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆత్మీయ అభినందన సమావేశంలో జరిగిన దాడి విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకుల పరస్పరం ఫిర్యాదు మేరకు శుక్రవారం కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ విచారణ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ పంచాయతీ పాలక వర్గం పదవీ కాలంలో గురువారంతో ముగియడంతో ఆత్మీయ అభినందన సన్మాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరుపార్టీల నాయకులు అదే రోజు రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్ఐ ప్రత్యక సాక్షులను వివరాలడిగి తెలుసుకున్నారు. విచారణ ఆధారంగా కేసు నమోదు చేస్తామన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు కమ్మరి రాధ, హరికృష్ణ శుక్రవారం రూ.20 వేల విరాళాన్ని హెడ్‌మాస్టర్ భిక్షపతికి అందించి ఆదర్శంగా నిలిచారు. పాఠశాల అభివృద్ధికి విరాళం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.

ఘనంగా ఉపాధి హామీ దినోత్సవం


ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న సిబ్బంది, కూలీలు

వర్గల్(గజ్వేల్): మండలంలో ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఆయా గ్రామాలలో కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు పున:ప్రారంభం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రంలో ఈనెల 5వ తేదీ నుంచి ఆధార్ సేవలను పున:ప్రారంభించనున్నట్లు ఆధార్ సెంటర్ నిర్వాహకుడు కుంట లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, ఈ-మెయిల్ లింక్, చిరునామా మార్పు, బయోమెట్రిక్ అప్డేట్, కొత్త ఆధార్ (0–5 లోపు పిల్లలకు), పేరు, డేట్ ఆఫ్ బర్త్ సవరణలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మ్యాథ్స్ ప్రతిభా పరీక్ష


కోహెడలో గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించారు. మొత్తం 30 మంది హాజరయ్యారు. ఇంగ్లీష్ మీడియంలో కోహెడ పాఠశాలకు చెందిన జి.పూజిత, రామచంద్రాపూర్ హైస్కూల్‌కు చెందిన వై.నవ్య, గుండారెడ్డిపల్లికి చెందిన శృతి కీర్తన, తెలుగు మీడియం నుంచి శనిగరం పాఠశాలకు చెందిన ఎస్.లాస్య, జి హరీశ్, ఎస్.రమ ఎంపికయ్యారు. సిద్దిపేటలో ఈనెల 5వ తేదీన జిల్లా స్థాయి గణిత ప్రతిభా పోటీలలో వీరంతా పాల్గొంటారని గణిత ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు జి.వేణుగోపాల్ తెలిపారు.

అన్నింటికీ మూలం గణితం

అక్కన్నపేట(హుస్నాబాద్): సమాజంలో అన్నింటికి గణితం మూలమని ఎస్ఐ తాండ్ర వివేక్ అన్నారు. అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వివేక్ హాజరై మాట్లాడారు. మనిషి నిత్య జీవితం గణితంతో ముడిపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నోముల చంద్రారెడ్డి, చందా మురళీధర్, అందే సంపత్, లక్ష్మణ్, రవీందర్, తిరుపతి రెడ్డి, భగవాన్, అక్కన్నపేట గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పెసరు సాంబరాజు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్‌లో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష శుక్రవారం నిర్వహించినట్లు హెచ్‌ఎం సత్తయ్య తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు ఫిబ్రవరి 5వ తేదీన ప్రజ్ఞాపూర్ హైస్కూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిభ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ పోటీ పరీక్షలతో సృజనాత్మకత వెలికితీయొచ్చు

సిద్దిపేటకమాన్: పోటీ పరీక్షల నిర్వహణతో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, నైపుణ్యాన్ని పెంపొందించొచ్చని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఇందిరమ్మ కాలనీలోని నలంద విద్యాలయంలో సెమ్స్ ఒలంపియాడ్ పత్రాపత్రాలను ట్రస్మా అధ్యక్షుడు గజ్జల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, సీనియర్ జర్నలిస్టు సంజీవరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, హరినాథ్ పాల్గొన్నారు.

◆ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటకమాన్: దివ్యాంగులకు ప్రతీనెల పెన్షన్ రూ.6 వేలు చెల్లించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగులు విజ్ఞప్తి చేశారు. సిద్దిపేటలో శుక్రవారం వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఆసరా పెంపు హామీ అమలు చేయాలన్నారు. సదరం శిబిరంలో దివ్యాంగుల సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. పెన్షన్ ప్రతీనెల 5 నుంచి 10వ తేదీ లోపు ఖాతాల్లో జమయ్యే విధంగా చూడాలన్నారు. మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని తమకు కూడా వర్తింపజేయాలన్నారు.

◆ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మద్దూరు(హుస్నాబాద్): రోడ్డు భద్రతానియమాలు పాటించాలని ఎస్ఐ షేక్ యునూస్ అహ్మద్ అలీ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రం నుంచి లద్నూరు గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ గౌడ్, ధర్మారం మాజీ సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆ షాపుల తనిఖీ

కోహెడ(హుస్నాబాద్): నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఎస్ఐ తిరుపతి తమ సిబ్బందితో కలిసి పలు పాన్‌షాపులు, బేకరీలలో తనిఖీలు నిర్వహించారు. గంజాయిని చాక్లెట్స్ రూపంలో విక్రయిస్తున్నరని సమాచారం అందడటంతో తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గజ్వేల్‌రూరల్: మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ సీఐ సైదా హెచ్చరించారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో పాటు వారు పనిచేసే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, తాగినట్లు తెలిస్తే గజ్వేల్ ఏసీపీ 8712667330, గజ్వేల్ సీఐ 8712667331, గజ్వేల్ పోలీస్‌స్టేషన్ 8712667460కు సమాచారం అందించాలన్నారు.

◆ నాటుసారా పట్టివేత

అక్కన్నపేట(హుస్నాబాద్): నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేటలో కుతాటి పోచయ్య నాటుసారా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. దీంతో శుక్రవారం అతడి ఇంటిలో తనిఖీ చేయగా 5 లీటర్ల నాటుసారా ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. నిషేధిత నాటుసారా ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


అక్కన్నపేటలో క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

అక్కన్నపేట(హుస్నాబాద్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు ప్రభుత్వం పే స్కేల్ ప్రకటించడాన్ని సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అక్కన్నపేట ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్(టీఏ) ఉమేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ ప్రకటించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

దుబ్బాకటౌన్: తెలంగాణలో జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు పే స్కేల్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం దుబ్బాకలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

గ్రామాలకు స్పెషలాఫీసర్ల నియామకం

నంగునూరు(సిద్దిపేట): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో నంగునూరు మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు స్పెషలాఫీసర్లను నియమించారు. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామపంచాయతీలను కేటాయించారు. వారు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.